క్లుప్తంగా

గ్రావెల్ అక్రమ తవ్వకాలపై కలెక్టర్‌కు ఫిర్యాదు

గోకవరం: మండలంలోని అచ్యుతాపురం ధనంమెట్టపై గ్రావెల్ అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయంటూ గ్రామానికి చెందిన మద్దా వెంకన్న సోమవారం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. ధనంమెట్టలో ఏడాది కాలంగా అక్రమ మైనింగ్ జరుగుతోందన్నారు. ప్రభుత్వం అనుమతి ఇచ్చిన దానికంటే ఎక్కువగా మైనింగ్ చేస్తూ పగలు, రాత్రి తేడా లేకుండా రవాణా చేస్తున్నారని ఆరోపించారు. అక్రమ మైనింగ్ కారణంగా సమీపంలోని పండ్ల తోటలు పాడవ్వడంతో పాటు శబ్ద, వాయు కాలుష్యంతో ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు.

గడ్డి ట్రాక్టర్ దగ్ధం



కాలువలో పడిపోయిన ట్రాక్టర్

బిక్కవోలు: మండలంలోని ఊలపల్లిలో సోమవారం గడ్డి ట్రాక్టర్ దగ్ధమైంది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం ఊలపల్లి నుంచి గంగ్రేడు గ్రామానికి వెళుతున్న గడ్డి ట్రాక్టర్‌కు కరెంట్ తీగలు తగలడంతో మంటలు చెలరేగాయి. పరిస్థితిని గమనించిన డ్రైవరు ట్రాక్టర్‌ను రోడ్డు పక్కగా నిలిపేసి ముందే దిగిపోవడంతో ప్రమాదం తప్పింది. అదే సమయంలో ట్రాక్టర్ అదుపుతప్పి పక్కనే ఉన్న కాలువలో పడిపోవడంతో మంటలు ఆరిపోయాయి. అనంతరం క్రేన్ సాయంతో కాలువలో ఉన్న ట్రాక్టర్‌ను బయటకు తీశారు.

ఓటు ప్రాధాన్యతను గుర్తించండి

అనపర్తి: ఓటు ప్రాధాన్యతను ప్రతి ఒక్కరూ గుర్తించాలని, అర్హత గల వారందరికీ ఓటు హక్కు కల్పించేలా వైఎస్సార్ సీపీ పార్టీ శ్రేణులు కృషి చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. అనపర్తిలోని పార్టీ కార్యాలయంలో సోమవారం వైఎస్సార్ సీపీ నియోజకవర్గ పోలింగ్ బూత్ కమిటీల ఇన్‌చార్జ్ సబ్బెళ్ళ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన నియోజకవర్గస్థాయి సమావేశంలో డాక్టర్ సూర్యనారాయణరెడ్డి పాల్గొని మాట్లాడారు. 2024 ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో నిబంధనల మేరకు ఓటు కల్పించే దిశగా కృషి చేయాలన్నారు. పార్టీ పోలింగ్ బూత్ కమిటీలు సమర్థవంతంగా, పారదర్శకంగా వ్యవహరించాలన్నారు. ప్రతి ఇంటికీ ఏదొక పథకం ద్వారా సంక్షేమం అందుతున్న నేపథ్యంలో సామాన్య ప్రజలు వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి అండగా నిలుస్తున్నారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రిగా రావాలన్నది ప్రజలందరి ఆకాంక్ష అని చెప్పారు. సమావేశంలో అనపర్తి, బిక్కవోలు, పెదపూడి, రంగంపేట మండలాల బూత్ కమిటీల ఇన్‌చార్జిలు కొండేటి భీమేష్, కొవ్వూరి వెంకటరెడ్డి, ఇవ్రా రెడ్డి, సబ్బెళ్ళ మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

8న జగనన్నకు చెబుదాం

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): గోకవరం మండల స్థాయిలో జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని ఈనెల 8వ తేదీన నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ మాధవీలత సోమవారం ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు, స్థానిక ప్రజా ప్రతినిధులు, జిల్లా, మండల స్థాయి అధికారులు పాల్గొంటారన్నారు. గోకవరంలోని గోపీకృష్ణ ఫంక్షన్ హాలులో ఆ రోజు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకూ ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తామన్నారు.

నేడు రైతు భరోసా నిధుల విడుదల

మధురపూడి: రైతు సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారు. వారికి అన్ని విధాలా అండగా ఉంటున్నారు. విత్తు నుంచి విక్రయం వరకూ తోడ్పాటు అందిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఐదో సంవత్సరం, రెండవ విడతగా రైతు భరోసా – పీఎం కిసాన్ నిధులను మంగళవారం విడుదల చేయనున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పుట్టపర్తిలో ఈ కార్యక్రమం ప్రారంభిస్తారు. జిల్లాస్థాయిలో కోరుకొండ మండలం శ్రీరంగపట్నంలో మంగళవారం ఉదయం 10 గంటలకు కార్యక్రమం జరుగుతుంది. ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు జక్కంపూడి రాజా అధ్యక్షత వహిస్తారు. కలెక్టర్ మాధవీలత ముఖ్యఅతిథిగా హాజరవుతారు. రాజానగరం నియోజకవర్గంలోని 31,989 మంది రైతులకు రూ.13.32 కోట్ల మేర లబ్ధి చేకూరనుంది.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

గోకవరం: గోకవరం శివారున గంగాలమ్మ ఆలయం సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే.. కామరాజుపేటకు చెందిన ముగ్గురు వ్యక్తులు బైక్‌పై రాజమహేంద్రవరం నుంచి గోకవరం వైపు వస్తుండగా గంగాలమ్మ ఆలయం సమీపంలో ఆటో వీరి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడగా చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. దీనిపై తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని గోకవరం పోలీసులు తెలిపారు.

అయ్యప్ప దీక్ష.. ఆరోగ్య రక్ష

- మాలధారణతో మానసిక ప్రశాంతత
- నియమ నిష్ఠలతో ఆధ్యాత్మిక చింతన



గ్రామోత్సవం నిర్వహిస్తున్న అయ్యప్ప దీక్షధారులు (ఫైల్)



అనపర్తి అయ్యప్ప ఆలయంలో పడి పూజోత్సవంలో పాల్గొన్న అయ్యప్ప భక్తులు (ఫైల్)

అనపర్తి: అయ్యప్ప మాల భక్తి ప్రపత్తులను చాటడమే కాకుండా మానసికోల్లాసం, మంచి ఆరోగ్యాన్ని ప్రసాదిస్తుంది. ఏటా అక్టోబర్, నవంబర్, డిసెంబర్ నెలల్లో భక్తులు మాలధారణ చేస్తుంటారు. ఈ ఏడాది అధిక సంఖ్యలో భక్తులు స్వామి మండల దీక్షను చేపట్టారు. అయ్యప్ప దీక్షాధారులతో గ్రామాలు ఆధ్యాత్మిక శోభతో అలరారుతున్నాయి. అనపర్తి నియోజకవర్గ పరిధిలోని అనపర్తి, బిక్కవోలు, రంగంపేట, పెదపూడి మండలాల్లో వేలాది మంది అయ్యప్ప భక్తులు మాలధారణ చేశారు.

క్రమశిక్షణకు బాటలు

41 రోజుల పాటు కఠిన బ్రహ్మచర్యం, నియమ నిష్ఠలతో ఆచరించే అయ్యప్ప దీక్ష శారీరక ఆరోగ్యాన్నే కాకుండా మానసిక ప్రశాంతతను చేకూరుస్తుంది. అలాగే మనిషిలో సత్ప్రవర్తనను మేల్కొలిపి క్రమశిక్షణకు బాటలు వేస్తుంది. సాత్విక ఆహారం, భేద భావం లేకుండా అందరినీ సమానంగా చూడడంటి నిబంధనలు దీక్షధారుల వ్యక్తిత్వాన్ని ఉత్తేజపరుస్తాయి. అయ్యప్ప మాల ధరించిన స్వాములు 41 రోజుల పాటు కఠోర దీక్షను పూర్తి చేసుకుని ఇరుముళ్లు కట్టి అనంతరం అయ్యప్ప కొలువై ఉన్న శబరిమలై వెళ్తుంటారు. అయితే ఇటీవల కాలంలో మండపేట మండలం ద్వారపూడి, అనపర్తి, మండపేట, రాజమహేంద్రవరంలోని అయ్యప్ప ఆలయాలకు వెళ్లి దీక్షను ముగిస్తున్నారు. 41 రోజుల దీక్ష సమయంలో చేసే పూజల్లో ఆరోగ్యపరమైన రహస్యాలు నిండి ఉన్నాయని గురుస్వాములు చెబుతారు.

చన్నీటి స్నానంతో ఉత్తేజం

ఉదయం, సాయంత్రం చన్నీటి స్నానం చేయడంతో శరీరంలో శక్తి, ఏకాగ్రత, ఉత్తేజం పెరుగుతాయని చెబుతారు. చన్నీటి శిరస్నానంతో రక్త పోటు తగ్గి జీర్ణశక్తి అభివృద్ధి చెందుతుంది.

చందనంతో చల్లదనం

నుదుటిపై చందనం, కుంకుమ, విభూతి ధరించడం వల్ల చల్లదనంతో పాటు మానసిక ప్రశాంతత కలుగుతాయి. కాళ్లకు చెప్పులు లేకుండా నడవడంతో చిన్న చిన్న రాళ్లు పాదాలకు తగిలి నరాలకు స్పందన కలుగుతుంది.

నల్లని వస్త్రాలతో వెచ్చదనం

శీతాకాలంలో స్వాములు నల్లటి వస్త్రాన్ని ధరిస్తారు. నల్లటి వస్త్రాలు వెచ్చదనాన్ని ఇస్తాయి. చలికాలంలో నల్లటి వస్త్రాలు శరీరానికి ఉపకరిస్తాయి. అలాగే భక్తులు శని ప్రభావానికి లోను కాకుండా ఉండేందుకు కూడా నల్లని వస్త్రాలు ధరిస్తారు.

ఆధ్యాత్మికం.. ఆరోగ్యం..

మండల దీక్ష చేపట్టడం ద్వారా ఆధ్యాత్మికంతో పాటు ఆరోగ్యం లభిస్తుంది. 41 రోజుల పాటు చన్నీటి స్నానం, ఒంటి పూజ భోజనం, దేవతారాధన మాలధారుల జీవితాలపై చక్కటి ప్రభావం చూపుతాయనడంలో ఎటువంటి సందేహం లేదు.

భక్తితో పాటు ఆరోగ్యం



అయ్యప్ప స్వామి దీక్ష చేపట్టడం ద్వారా ఆధ్యాత్మికతతో పాటు మంచి ఆరోగ్యం చేకూరుతుంటుంది. మనసు ఉత్తేజంగా ఉంటుంది. నేను ఇప్పటివరకూ 32 సార్లు మాల ధరించి అయ్యప్ప స్వామిని దర్శించుకున్నాను. ఈ ఏడాది స్వాముల సంఖ్య పెరిగింది.

– పడాల సత్తిరెడ్డి, గురుస్వామి, అనపర్తి

విశ్వాసంతో దీక్ష చేపట్టాలి



దారి తప్పుతున్న జీవితాల్ని తీర్చిదిద్దేందుకు అయ్యప్ప దీక్ష ఎంతో దోహదపడుతుంది. చెడు అలవాట్లను దూరం చేస్తుంది. ఆధ్యాత్మిక చింతన, దృఢ సంకల్పం, స్వామిపై విశ్వాసంతో దీక్ష చేపడితే అయ్యప్ప కృపకు పాత్రులు కావచ్చు. నేను ఎనిమిదోసారి మాలధారణ చేశాను.

– అద్దాల శ్రీను, అనపర్తి

9 నుంచి వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం

- త్వరలో జిల్లాలో సామాజిక సాధికార బస్సు యాత్రలు
- ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా

మధురపూడి: ఈ నెల 9 నుంచి జిల్లాలో 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా జరుగుతుందని రాజానగరం ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా ఆంధ్రప్రదేశ్‌కు మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డే ముఖ్యమంత్రి కావాలనే అంశంపై ప్రజల్లో అవగాహన కల్పిస్తామని చెప్పారు. కోరుకొండ మండలం జంబూపట్నంలో సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. రాజానగరం నియోజకవర్గానికి సంబంధించి 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం దివాన్‌చెరువు ఎంఎఫ్ ఫంక్షన్ హాలులో జరుగుతుందని తెలిపారు. జిల్లాలో సామాజిక సాధికార బస్సు యాత్రలు త్వరలో నిర్వహిస్తామని తెలిపారు. దీనికి సంబంధించిన తేదీలను త్వరలో ప్రకటిస్తామని చెప్పారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు సామాజిక సాధికారత కల్పించిన ఏకైక ప్రభుత్వం సీఎం వైఎస్ జగన్‌దేనన్నారు. ఈ వర్గాలు ఉత్పత్తిలో కీలక పాత్ర పోషించినప్పటికీ గత పాలకులు వీరికి సంపూర్ణమైన గుర్తింపు ఇవ్వలేదన్నారు. వైఎస్సార్ రైతుభరోసా – పీఎం కిసాన్ నిధుల విడుదల జిల్లా స్థాయి కార్యక్రమం మంగళవారం కోరుకొండ మండలం శ్రీరంగపట్నంలో నిర్వహిస్తామని ఎమ్మెల్యే రాజా తెలిపారు. ఈ కార్యక్రమానికి రైతులు, వైఎస్సార్ సీపీ శ్రేణులు తరలిరావాలని కోరారు.

పేదల సంక్షేమమే జగనన్న సంకల్పం

ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి



ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డికి కేక్ తినిపిస్తున్న పార్టీ నాయకులు

అనపర్తి: పేదల సంక్షేమమే జన హృదయనేత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పమని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, సీఎం వైస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించిన ప్రజా సంకల్పయాత్ర చేపట్టి ఆరేళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కేక్‌ను కట్ చేసి పార్టీ శ్రేణులకు పంచారు. కార్యక్రమంలో ముందుగా దివంగత నేత వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇచ్చిన మాటకు కట్టుబడి పనిచేసే వ్యక్తి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నాడు చేపట్టిన ప్రజా సంకల్ప పాదయాత్రతో నేడు రాష్ట్ర ప్రజలకు సంక్షేమ పాలన అందుతోందన్నారు. ప్రతిపక్ష హోదాలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజాసంకల్ప పాదయాత్ర దేశ రాజకీయాల్లో ఓ సంచలనమన్నారు. సుదీర్ఘ పాదయాత్రలో ప్రజల కష్టాలను స్వయంగా తెలుసుకున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేదల అభ్యున్నతే ధ్యేయంగా నవరత్న పథకాలను రూపకల్పన చేశారని చెప్పారు. సామాజిక న్యాయం పాటిస్తూ పలు సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతూ పాలన సాగిస్తున్న సీఎం జగన్ సరికొత్త రికార్డులు సృష్టిస్తున్నారన్నారు. కార్యక్రమంలో అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, సర్పంచ్ వారా కుమారి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్లు సత్తి రామకృష్ణారెడ్డి, పోతుల ప్రసాదరెడ్డి, గుత్తుల వెంకటరమణ, జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యుడు లంక చంద్రన్న, ఏఎంసీ ఉపాధ్యక్షుడు అడబాల వెంకటేశ్వరరావు, రిమ్మలపూడి వెంకటేశ్వరరావు, కొల్లాటి ఇబ్రాయిల్, నల్లమిల్లి మురళీమోహన బాల కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదల గుండె చప్పుడు సీఎం జగన్

- ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి
- పెదపూడిలో గడప గడపకూ మన ప్రభుత్వం



పెదపూడిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

పెదపూడి: పేదల గుండె చప్పుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. పెదపూడిలో సోమవారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా నాలుగున్నరేళ్లుగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా ఏ కుటుంబానికి ఎంత మేర లబ్ధి చేకూరిందో ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ పేదరికమే ప్రామాణికంగా ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ముఖ్యమంత్రి జగన్ మళ్లీ ముఖ్యమంత్రిగా రావాలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. గ్రామంలో ఏ గడపకు వెళ్లిన మళ్లీ జగన్ ముఖ్యమంత్రి అయితేనే మా కుటుంబాలు మరింత అభివృద్ధి చెందుతాయని ప్రజలు చెబుతున్నారన్నారు.

ఎమ్మెల్యేకు బ్రహ్మరథం

గ్రామంలో గడప గడపకూ వెళుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డికి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. ప్రతి గడపలోనూ మహిళలు పెద్ద ఎత్తున హారతులిస్తున్నారు. శాలువాలు కప్పి పూలమాలలు వేసి అపూర్వ స్వాగతం పలుకుతున్నారు. గ్రామంలో రోజురోజుకూ వైఎస్సార్ సీపీకి మరింత ఆదరణ పెరుగుతుందనడానికి ఇది నిదర్శనమని స్థానిక నేతలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతా తులసి, జెడ్పీటీసీ సభ్యురాలు పేపకాలయ వెంకటలక్ష్మి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి అద్దంకి ముక్తేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు సమ్మంగి దుర్గాప్రసాద్, సొసైటీ చైర్మన్ మార్ని కామరాజు చౌదరి, ఈదేటి రాంబాబు, అందుగుల అబ్బు, దొండపాటి దావీదు, నర్ల శ్రీను, ఇందుగపల్లి కాటయ్య తదితరులు పాల్గొన్నారు.

జంబూపట్నం అభివృద్ధికి రూ.3.10 కోట్లు

- వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యం
- గడప గడపకూ మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా



జంభూపట్నంలో మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

మధురపూడి: జంబూపట్నం గ్రామంలో రూ.3.10 కోట్లతో అభివృద్ధి పనులు నిర్వహించినట్టు ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. ఆ గ్రామంలో సోమవారం ఆయన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజా మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు. స్థానిక జగనన్న కాలనీ, పాతూరు రామకోవెల ప్రాంతాల్లో 300 గడపలను సందర్శించి, ప్రజలతో మాట్లాడారు. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలందుతున్న తీరును ఆరా తీశారు. వారు తెలిపిన విద్యుత్ స్తంభాలు, మురుగునీటి కాలువల నిర్మాణం, ఇళ్ల స్థలాలు తదితర వాటిపై సంబంధిత అధికారులతో చర్చించారు. త్వరలో సమస్యలు పరిష్కారమవుతాయని ప్రజలకు హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే రాజా మాట్లాడుతూ చంద్రబాబు పాలనలో ఈ గ్రామానికి కేవలం రూ.25 లక్షలు నిధులు మాత్రమే కేటాయించారని, అదే వైఎస్సార్ సీపీ నాలుగున్నర కాలంలో రూ.3.10 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టినట్టు తెలిపారు. రాష్ట్రంలోని విలేకరులకు నివాస స్థలాలు ఇవ్వాలన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిర్ణయం అభినందనీయమన్నారు. అలాగే ప్రజాసంకల్పయాత్రకు ఆరేళ్లు పూర్తయిన సందర్భంగా జంబూపట్నంలో కేక్ కటింగ్ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉల్లి వీర వెంకట సత్య సూర్యకుమారి, జెడ్పీటీసీ కర్రి నాగేశ్వరరావు, జంబూపట్నం సర్పంచ్ ఉల్లి అప్పన్నదొర, వైఎస్సార్ సీపీ మాజీ మండల కన్వీనర్ ఉల్లి బుజ్జిబాబు, మాజీ సర్పంచ్ నాగా సత్తిబాబు, మాజీ ఎంపీటీసీ సభ్యుడు ఉల్లి చెల్లారావు, పార్టీ నాయకులు ఉల్లి గణ, తోరాట సత్యప్రసాద్, సచివాలయం సెక్రటరీ ఎస్‌కే మదార్ బీబీ పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతికి అనేక పథకాలు

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- లబ్ధిదారుడికి టిప్పర్ అందజేత



లబ్ధిదారుడికి టిప్పర్ అందజేస్తున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

రాజానగరం: బడుగు, బలహీన వర్గాల సంక్షేమం, అభివృద్ధి కోసం జగన్ ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. వైఎస్సార్, జగనన్న బడుగు వికాసం పథకంలో కోరుకొండ మండలం నిడిగట్లకు చెందిన బి.అంబేడ్కర్‌కు మంజూరైన టిప్పర్‌ని రాజమహేంద్రవరం ప్రకాష్‌నగర్‌లోని తన కార్యాలయం వద్ద సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాజా మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలనేదే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆశయమన్నారు. ఈ పథకం ద్వారా అమలు చేసే ప్రతి యూనిట్ విలువలో 40 శాతం సబ్సిడీగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు యడ్ల గంగా సురేష్, ఎం.శ్రీను, చంటి, సుంకర శివ పాల్గొన్నారు.

సురక్ష శిబిరాలతో మెరుగైన వైద్యం



సంపత్ నగరంలో మందులు పంపిణీ చేస్తున్న వైద్యసిబ్బంది

రాజానగరం: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలతో ప్రజలకు మెరుగైన వైద్యం అందుతోందని జెడ్పీటీసీ సభ్యుడు వాసంశెట్టి పెద వెంకన్న, సంపత్ నగరం సర్పంచ్ పెంటగట్ల రామకృష్ణ అన్నారు. సంపత్ నగరంలో సోమవారం నిర్వహించిన వైద్య శిబిరాన్ని వారు సందర్శించారు. అక్కడ అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. ఎంపీడీఓ ఇన్‌చార్జి ఎం.సుబ్రహ్మణ్యం పర్యవేక్షణలో రాజానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ టి.రవికుమార్, డాక్టర్ సీహెచ్ వెంకటలక్ష్మి, డాక్టర్ సాయిసుధ, డాక్టర్ గోపీకృష్ణ, సీహెచ్ కృపాబాయి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో 829 మందికి వైద్య పరీక్షలు చేశారు. వారిలో 145 మంది కంటి పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు లంక అమ్మిరాజు, లంక ఆదినారాయణ, లంక మాచరావు, కోనే మురళీ పాల్గొన్నారు. కాగా.. మంగళవారం జి.యర్రంపాలెంలో జగనన్న సురక్ష వైద్య శిబిరం నిర్వహిస్తారని ఎంపీడీఓ ఇన్‌చార్జి తెలిపారు.

అధిక మొత్తంలో బెల్లం విక్రయాలు వద్దు



సత్యనారాయణ
సెబ్ సీఐ

మధురపూడి: బెల్లం విక్రయాల్లో నిబంధనలు పాటించాలని, అధిక మొత్తంలో విక్రయాలు చేస్తే కఠినమైన చర్యలుంటాయని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) కోరుకొండ సీఐ జి.సత్యనారాయణ హెచ్చరించారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ కిరాణా వ్యాపారస్తులు 10 కేజీల కంటే ఎక్కువగా బెల్లం విక్రయాలు చేయరాదని, 100 కేజీలకు మించి దుకాణాల్లో నిల్వ ఉంచరాదన్నారు. జీఎస్టీ, ట్రేడ్, ఫుడ్, ఏఎంసీ లైసెన్సులు ఉండాలన్నారు. అలాగే వ్యాపారస్తులు ఆధార్ కార్డులు అడిగి కొనుగోలు దారులకు విక్రయించాలన్నారు. గుమ్ములూరు, నిడిగట్ల గ్రామాల్లో సోమవారం నిర్వహించిన దాడుల్లో 10 లీటర్ల సారాతో చిటికిన సత్తిబాబును అరెస్టు చేశామని, అతడి వద్ద 200 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశామన్నారు. నిడిగట్లకు చెందిన కుడుముల రమేష్‌ను 10 లీటర్ల సారాతోను, బెల్లం విక్రయిస్తున్న కిరాణా వ్యాపారిని అరెస్టు చేసినట్టు తెలిపారు. కోరుకొండ, సీతానగరం, గోకవరం మండలాలతో కూడిన సర్కిల్ పరిధిలో 33 హోల్‌సేల్ కిరాణా వ్యాపారస్తులున్నారని, వారికి అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్టు తెలిపారు.

ఉరేసుకుని కూలీ ఆత్మహత్య

వెంకటకృష్ణాపురం (మర్రిపూడి): ఉరేసుకుని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ప్రకాశం జిల్లా మర్రిపూడి మండలం వెంకటకృష్ణాపురం గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం రామచంద్రాపురం గ్రామానికి చెందిన మందపాటి గంగరాజు(35)తో పాటు మరో 10 మంది కూలీలు పొగ నారుమళ్లలో పనిచేసేందుకు వెంకటకృష్ణాపురం వచ్చారు. గంగరాజు మద్యానికి బానిసయ్యాడు. కుటుంబ కలహాల నేపథ్యంలో భార్యతో పాటు తన ముగ్గురు బిడ్డలు గత కొన్ని నెలలుగా దూరమయ్యారు. ఈ క్రమంలో మనస్థాపం చెందిన గంగరాజు సోమవారం పూటుగా మద్యం సేవించి కూలీలు నివాసం ఉంటున్న బ్యారన్‌లో మద్యం మత్తులో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సంఘటనా స్థలాన్ని ఏఎస్సై రవికుమార్ పరిశీలించారు. గంగరాజు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పొదిలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వీఆర్వో ఏబేలు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

చిత్రలేఖనం పోటీలు

రాజానగరం: బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని దివాన్‌చెరువులోని డాక్టర్ వినయ్ సుంకర ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఐదు నుంచి 18 ఏళ్ల బాలలకు సోమవారం చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. అలాగే బుధవారం ఆటల పోటీలు జరుగుతాయని ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సుంకర వెంకటేశ్వరావు తెలిపారు. ఈ పోటీలలో పాల్గొనాలనుకునే వారు ముందుగా తమ వివరాలను 8328 229233 నంబర్‌కు ఫోన్ చేసి తెలియజేయాలన్నారు.

రేపు మహా సుదర్శన, రుద్ర హోమాలు



శ్రీనివాసం లేఅవుట్‌లో జరుగుతున్న ఏర్పాట్లు

రాజానగరం: రాజానగరం నుంచి కొత్త వెలుగుబందకు వెళ్లే మార్గంలోని శ్రీనివాసం లేవుట్‌లో బుధవారం శ్రీలక్ష్మీ గణపతి సహిత మహా సుదర్శన హోమం, ఆదిత్యాత్మిక రుద్ర మహా సుదర్శన హోమం నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు వేగంగా జరుగుతున్నాయి. అలాగే అష్టోత్తర శత సుదర్శన చక్రములకు అష్టోత్తర శత నామార్చన చేయడంతో అయ్యప్పస్వామి మాల ధరించి, దీక్షలలో ఉన్న స్వాములచే అయ్యప్పస్వామి పడిపూజా కార్యక్రమాలు కూడా జరపనున్నారు. స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా, ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్‌లచే ఈ కార్యక్రమాలు జరుగనున్నాయి. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ దూలం పెద్ద, సోదరులు చిన్న, గోపి సహకారంతో కానవరం సొసైటీ చైర్‌పర్సన్ వాడ్రేవు శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమాలను వేద పండితులు దీక్షితులు రామకృష్ణశాస్త్రి, రేగడమిల్లి రామ్‌దేవ్‌శర్మ, దేవులపల్లి రామకృష్ణశర్మ పర్యవేక్షణలో అత్యంత వైభవంగా నిర్వహించేందుకు విశ్రాంత వీఆర్వో, వైఎస్సార్ సీపీ నాయకుడు ఈ.కామేశ్వరరావు తదితరులు ఏర్పాట్లు చేస్తున్నారు.

హోరాహోరీగా బాస్కెట్‌బాల్ టోర్నమెంట్ సెలక్షన్స్



జి.మామిడాడలో హోరాహోరీగా సాగుతున్న బాస్కెట్‌బాల్ లీగ్ మ్యాచ్

పెదపూడి: జి.మామిడాడలోని ద్వారంపూడి లక్ష్మణ రెడ్డి డిగ్రీ కాలేజీలో ఆదికవి నన్నయ యూనివర్సిటీ టోర్నమెంట్ కమ్ సెలక్షన్స్ రెండో రోజు హోరాహోరీగా సాగాయి. ముఖ్య అతిథిగా కాలేజీ వ్యవస్థాపకుడు డీఆర్‌కే రెడ్డి హాజరయ్యారు. టోర్నమెంట్ ఆర్గనైజింగ్ కార్యదర్శులు సత్యనారాయణరెడ్డి, వెంకటరెడ్డి, ఆదికవి నన్నయ యూనివర్సిటీ సెలక్షన్స్ కమిటీ ఆల్ ఇండియా బాస్కెట్‌బాల్ యూనివర్సిటీ జట్టును ఎంపిక చేశారు. తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల నుంచి మొత్తంగా 14 జట్లు పాల్గొన్నాయి. నాకౌట్ కమ్ లీగ్ పద్ధతిలో టోర్నమెంట్ నిర్వహించారు. ఉత్కంఠగా సాగిన పోటీలో జి.మామిడాడ డీఆర్‌కె రెడ్డి కాలేజీ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ మొదటి స్థానం, పెనుమంద్ర ఎస్వీకేపీ కాలేజీ రెండో స్థానం, జి.మామిడాడ డీఎల్ఆర్ డిగ్రీ కళాశాల మూడో స్థానం, రాజమహేంద్రవరం గవర్నమెంట్ ఆర్ట్స్ కళాశాల నాలుగో స్థానంలో నిలిచాయి. టోర్నమెంటులో అత్యుత్తమ ప్రతిభ ప్రదర్శించిన క్రీడాకారులను ఆల్‌ఇండియా బాస్కెట్‌బాల్ యూనివర్సిటీ జట్టుకు ఎంపిక చేశారు. ఈ టీమ్ త్వరలో కేరళలో జరిగే పోటీల్లో పాల్గొంటుంది. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టి.శ్రీనివాసరెడ్డి, సెలక్షన్స్ కమిటీ మెంబర్లు బి.రామకృష్ణ, రామగోపాల్, డీఆర్‌కేరెడ్డి కాలేజీ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపాల్ సబ్బెళ్ల శివన్నారాయణరెడ్డి, పీడీలు సత్యనారాయణ, సూరారెడ్డి, గౌరీశంకర్‌రెడ్డి, బుల్లి గంగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.